www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 26 జనవరి 2023
5
కాకినాడ

సంకురాత్రి చంద్రశేఖర్‌కు పద్మశ్రీ అవార్డు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్‌ను పద్మశ్రీ అవార్డు వరించింది. కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన 25 మంది పేర్లలో చంద్రశేఖర్‌కు చోటు దక్కింది. వైద్య రంగంలో విశేష సేవలందించినందుకు చంద్రశేఖర్‌కు ఈ అవార్డు లభించింది. సంకురాత్రి ఫౌండేషన్ పేరుతో ఆయన కాకినాడలో పలు సేవా, సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయనకు పద్మశ్రీ రావడంపై పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. మరణించిన ఆయన భార్య మంజరి, కుమారుడు కిరణ్, కుమార్తె శారద జ్ఞాపకార్థం డాక్టర్ చంద్ర శేఖర్ 1989లో సంకురాత్రి ఫౌండేషన్ స్థాపించి సేవలు అందిస్తున్నారు.

నేటి నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం

- ప్రత్యామ్నాయం చూపని ప్రభుత్వం
- ఉపాధికి పలువురు దూరం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధాన్ని ప్రభుత్వం పక్కాగా అమలు చేయనుంది. బుధవారం నుంచి ఫ్లెక్సీల వినియోగం, ప్రదర్శన, ముద్రణ, రవాణా వంటి వాటిపై నిషేధం పెట్టారు. ఇంత వరకూ బాగానే ఉన్నా ఫ్లెక్సీ యూనిట్లపై ఆధారపడుతున్న వారికి ప్రత్యామ్నాయం చూపకుండానే దీని అమలుకు పూనుకుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కాకినాడ డివిజన్‌లో 27, రాజమండ్రి డివిజన్‌లో 43, పెద్దాపురం డివిజన్‌లో 38, రామచంద్రపురం డివిజన్‌లో 28, అమలాపురం డివిజన్‌లో 28 ఇలా సుమారు 160 ఫ్లెక్స్ యూనిట్లు నడుస్తున్నాయి. ప్రత్యక్షంగా సుమారు 1000 మంది, వీరు కాకుండా బ్యానర్లు కట్టేవాళ్లు, వెల్డింగ్ చేసేవాళ్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసేవారు, ఫ్రేమ్‌లు తయారు చేసే కార్పెంటర్లు ఇలా పరోక్షంగా ఆధారపడిన వారు 10 వేల మంది పైనే ఉంటారు.

పాతికేళ్ల క్రితం గోడలపై రాతల ద్వారా ప్రచారం జరిగేది. ఎన్నికల సమయాల్లో అభ్యర్థి పేరు, గుర్తు, పార్టీను సూచిస్తూ ఓటు వేయాలని అభ్యర్థించే వారు. 25 ఏళ్ల క్రితం ఫ్లెక్సీలు తెరపైకి రావడంతో ప్రచార తీరు పూర్తిగా మారిపోయింది. గత కొన్నేళ్లుగా శుభ, అశుభ కార్యాలతో బాటు వ్యాపార ప్రకటనల, షాపుల పేర్లు, స్వాగత బ్యానర్లను ప్లాస్టిక్ ఫ్లెక్సీలను వినియోగిస్తున్నారు. డిమాండ్ పెరగడంతో పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీ యూనిట్లు విచ్చలవిడిగా వెలిశాయి. అనేకమంది యువత ఉపాధికి చూపుతున్నాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించిన తరుణంలో ఈ పరిశ్రమ మూతపడే అవకాశం కనిపిస్తుంది. దీంతో యజమానులు, ప్రింటర్లు, డిజైనర్లు, మేకర్లు, ఫిక్సింగ్ వర్కర్లు జీవనాధారం కోల్పోయే ప్రమాదం ఉంది.

కాకినాడలో మూతబడిన ఒక ఫ్లెక్సీ యూనిట్

ప్రత్యామ్నాయం చూపకుండానే...

జిఒ నెంబర్ 65 ద్వారా గత సంవత్సరం నవంబర్ 1 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలను నిషేధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. సాంకేతిక పరిజ్ఞానం, తయారీ సామగ్రిని సమర్చుకునేందుకు తగిన సమయం ఇవ్వాలని ఫ్లెక్సీ తయారీదారుల విజ్ఞప్తి చేయడంతో ప్రభుత్వం నిషేధాన్ని ఈ నెల 26 వరకూ పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వం జిఒ నెంబర్ 75ను విడుదల చేసింది. సాంకేతిక పరిజ్ఞానం విషయంలో వారికి సాయం చేయాలని సిఎం జగన్ ఆదేశాలు ఇచ్చారు. సామగ్రి మార్పు కోసం రూ.20 లక్షల వరకు ఫ్లెక్సీ తయారీదారులకు పావలా వడ్డీపై రుణాలు, సబ్సిడీ లోన్లు ఇవ్వాలని చెప్పారు. అవసరమైన క్లాత్‌ను అందుబాటు ధరల్లో ఉంచాలని కూడా ఆదేశించారు. కానీ ఇవేమీ అమలు కాలేదు. పాత యూనిట్లకు ఒక్కొక్కరూ రూ.20 నుంచి 30 లక్షలు ఖర్చు చేశారు. క్లాత్ ప్రింటింగ్‌కు అనుగుణంగా మార్పులు చేయాలంటే కొత్తగా రూ.50 లక్షల వరకు పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వం రుణాలు ఇవ్వకపోవడం, క్లాత్ ఎక్కడా అందుబాటులో లేకపోవడం, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ఉమ్మడి జిల్లాలో పలు యూనిట్లు ఇప్పటికే మూతబడ్డాయి.

ప్రభుత్వం రుణాలు ఇవ్వాలి

ప్రభుత్వం నిషేధం విధించడంతో రూ.లక్షల్లో పెట్టుబడులు నష్టపోయాం. ప్లాస్టిక్ నిషేధానికి మేము వ్యతిరేకం కాదు. ప్రత్నామ్యాయం లేక యూనిట్ లను మూసివేసాం. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రుణాలు ఇచ్చి ఆదుకోవాలి. పావలా వడ్డీ రుణాలతో పాటు సబ్సిడీ లోన్లు అందివ్వాలి.

- సుంకర రవి, శ్రీ సాయి డిజిటల్, పెద్ద మసీదు వెనుక, కాకినాడ.

నిషేధంపై రోడ్డున పడ్డాం

ప్లాస్టిక్ ఫ్లెక్సీలను నిషేధించడంతో యూనిట్లపై ఆధారపడిన వారందరం రోడ్డున పడ్డాం. అనేకమంది ఉపాధికి గండి పడింది. ప్రభుత్వం ఇటువంటి ప్రత్యామ్ మాయం చూపకుండానే ఫ్లెక్సీలను నిషేధిస్తూ నిర్ణయం తీసుకోవడం శోచనీయం.

- కె.మహేష్, ఫ్లెక్స్ యూనిట్ యజమాని, కాకినాడ

ప్రభుత్వానికి పేదలే అండ : మంత్రి వేణు

ప్రజాశక్తి-కాజులూరు

ప్రభుత్వానికి పేద ప్రజలే అండగా నిలుస్తారని బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని అంద్రంగిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టినట్టు చెప్పారు. వీటిని కచ్చితంగా అమలు చేసేందుకు సచివాలయ వాలంటీర్ వ్యవస్థల ద్వారా అమలు చేస్తున్నట్టు చెప్పారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు చేస్తున్నట్టు చెప్పారు. వీటిని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు సచివాలయ సారథులను నియమిస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి పేద కుటుంబానికీ ఎంతెంత లబ్ధి చేకూరిందో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు, ఎంపిపిపి మాత భారతీ మురళి, సర్పంచ్ పెద్దిరెడ్డి నాగ సుజాత, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పెద్దిరెడ్డి వెంకటరమణ, ఎంపిడిఒ ఇందిరాదేవి స్థానిక నాయకులు కేసన వీర్రాజు, యాళ్ల సత్తిబాబు, సలాది నానాజీ పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న మంత్రి

చేతి వృత్తిదారులకు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతి వృత్తిదారులను వృత్తులకు దూరం చేస్తున్నాయని, కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తూ వృత్తులను ధ్వంసం చేస్తున్నాయని సంఘం నాయకులు కోనేటి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై రాష్ట్ర స్థాయి సదస్సు విజయవాడ ఎంబి.విజ్ఞాన కేంద్రంలో ఈనెల 30న ఉదయం 10 గంటలకు జరుగుతుందన్నారు. చేతి వృత్తిదారులు ఈ సదస్సును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సిహెచ్.అజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 56 రకాల చేతివృత్తిదారులకు అభివృద్ధి, సంక్షేమ కార్పోరేషన్లు ఏర్పాటు చేసినట్టు గొప్పగా ప్రకటించినా నిధులు మాత్రం విడుదల చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. రాబోవు బడ్జెట్లోనైనా తగిన నిధులు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో ఎం.రాజశేఖర్, కె.నాగేశ్వరరావు, పోలిపల్లి శ్రీను, అనపర్తి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్

74వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్టు కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలపారు. బుధవారం కాకినాడ పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాట్లను ఆమె ఎస్‌పి ఎం.రవీంద్రనాథ్ బాబు ఇతర పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. నూతనంగా నిర్మించిన పబ్లిక్ గ్యాలరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో రూ.20 లక్షలతో విఐపి, సాధారణ ప్రజల కోసం రెండు గ్యాలరీలు నిర్మించినట్టు చెప్పారు. ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు మాట్లాడుతూ వేడుకలను దష్టిలో ఉంచుకుని భద్రతపరంగా అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఒఎన్‌జిజి ఎడి ఆదేశ్ కుమార్ శర్మ, హెచ్‌ఆర్ విభాగపు అధిపతి డి.మాలిక్, ఎఎస్‌పిలు పి.శ్రీనివాస్, బి.సత్యనారాయణ, డిఎస్‌పిలు ఎం.అంబికా ప్రసాద్, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

యూకో బ్యాంకులో అప్రైజర్ చేతివాటం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నగరంలోని సూర్యారావుపేటలోని యూకో బ్యాంకులో గోల్డ్ అప్రైజర్ ఖాతాదారులను మోసగించి నకిలీ బంగారం పెట్టి రూ.2 కోట్ల మేర స్వాహా చేసిన ఉదంతం వెలుగు చూసింది. అప్రైజర్ కె.శ్రీనివాసరావు బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టేందుకు వచ్చే ఖాతాదారుల నుంచి బంగారం తీసుకుని నకిలీ ఆభరణాలను బ్యాంకులో జమ చేస్తున్నాడు. ఖాతాదారులతో పరిచయం పెంచుకుని తన దగ్గర ఉన్న బంగారాన్ని వారి పేరు మీద వేరేచోట తాకట్టు పెట్టాలని, పదిశాతం కమీషన్ ఇస్తానని మాయమాటలు చెప్పేవాడు. ఇలా 40 మంది ఖాతాదారులకు టోకరా వేసి రూ.2 కోట్లు స్వాహా చేశాడు. ఇటీవల బ్యాంకు ఆడిట్‌లో ఈ 40 మంది నకిలీ బంగారం తాకట్టుపెట్టి లోన్ తీసుకున్నట్టు నిర్ధారణ కావడంతో అధికారులు వారికి నోటీసులు పంపారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. డిఎస్‌పి మురళీకృష్ణ విచారణ చేపట్టినట్టు తెలిసింది.

ఓటు హక్కుపై అవగాహన అవసరం

13వ జాతీయ ఓటర్ల దినోత్సవాలను పలుచోట్ల బుధవారం ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకుని ఓటు హక్కు వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా పిలుపునిచ్చారు. పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడకల్ల జెఎన్‌టియుకె విసి ప్రసాద్ రాజు, జెడ్‌పి సిఇఒ ఎన్‌విపి.సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపల్ కె.రామచంద్రరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. అందరిచేత ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆర్.వెంకటేశ్వరరావు (వైసిపి), ఎస్.అప్పారావు(బిఎస్‌పి), పట్టణ తహసీల్దార్ పివి.సీతాపతి రావు, డిటిలు సిహెచ్.లక్ష్మీప్రసన్న, ఎం.జగన్నాథం పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడారు. విశ్రాంత తాసిల్దార్ రేలంగి బాపిరాజును ఘనంగా సత్కరించారు. రవిశంకర్ పట్నాయక్, చింతపల్లి సుబ్బారావు, రాఘవరావు, రాజా పాల్గొన్నారు. **గండేపల్లి** ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ మాట్లాడారు. కళాశాల సిబ్బంది విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. డీన్ రవికుమార్, డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, కె.అశోక్‌కుమార్, కె.వెంకటరమణ పాల్గొన్నారు. **పెద్దాపురం** వడ్లమూరులో విద్యార్థినిలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. హెచ్‌ఎం ప్రసాద్, కంటే వీర రాఘవరావు బహుమతులు అందజేశారు.

ఓటర్ల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కెవిపిఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

కెవిపిఎస్ జిల్లా క్యాలెండర్‌ను తహశీల్దారు పోతురాజు బుధవారం రెవెన్యూ కార్యాలయంలో ఆవిష్కరించారు. కెవిపిఎస్ గౌరవాధ్యక్షులు వడ్డి ఏడుకొండలు మాట్లాడారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలో కుల నిర్మూలన ఆధారంగా, కుల నిర్మూలన అంతరించాలనే లక్ష్యంతో సంఘం పోరాడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షులు విప్పర్తి శ్రీనివాస్, కార్యదర్శి మురాల రాజేష్, గోపాలకష్ణ, ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, అత్తిలి బాబురావు పాల్గొన్నారు.

సమస్యలపై అంగన్‌వాడీల ఆందోళనలు

అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన జిల్లావ్యాప్తంగా బుధవారం ఆందోళనలు చేపట్టారు. ఆయా కేంద్రాల్లో ఐసిడిఎస్ అధికారులకు వినతిపత్రాలు అందించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడలో డైరీ ఫారం సెంటర్‌లో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఆందోళనలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు, సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీలపై పని భారం పెంచుతోందన్నారు. అధికారులు బిల్లులు చెల్లించకుండా వంటలు చేయమని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. కాకినాడలో మెర్జింగ్ సెంటర్ల పేరుతో పిల్లలను ట్రాఫిక్ ఉన్న మెయిన్ రోడ్ దాటించడం, కిలోమీటరు దూరం నడిపించడం సమంజసంగా లేదన్నారు. నెలల తరబడి కూరగాయల బిల్లు చెల్లించకుండా, కూరలు వండకపోతే కుదరదని అధికారులు హడావుడి చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయాలకు ప్రమోషన్ వయోపరిమితి పెంచాలని, ఫేస్ యాప్ హాజరు పద్దతి ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం సిడిపిఒ విజయలక్ష్మికి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.రమణమ్మ, నగర అధ్యక్ష కార్యదర్శులు టి.నీరజ, ఎంకె జ్యోతి, నాయకులు సరోజ, మున్నీ, వెంకటలక్ష్మి, రమ, సత్యవేణి, సిహెచ్. రమ, నాగూర్, దుర్గాభవాని, దీప్తి, రాధ, ప్రేమ జ్యోతి, కనకదుర్గ, అమ్మాజీ, వీరవేణి, విజయ, శ్రీదేవి, సరోజ, సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు పాల్గొన్నారు. **తాళ్లరేవు** సిడిపిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ప్రాజెక్టు లీడర్ వి.పద్మజ, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, కెవిపిఎస్ నాయకులు మురాల రాజేష్, పి.ఆదిలక్ష్మి, ఉషా, వరలక్ష్మి, పాల్గొన్నారు. సామర్లకోట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. టి.నాగమణి, ఎ.అమలావతి ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాస్, ఎ.వాణీదేవి, హెచ్‌వి.రమణమ్మ, సత్యకుమారి, దుర్గ, పద్మ, చంటి పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్‌లో** ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. వి.ఎస్తేరురాణి, సిఐటియు జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాస్ మాట్లాడారు. ఎం.రాజేశ్వరి, ఎ.కనకదుర్గ, ఎస్.దుర్గాదేవి, డి.నాగమణి, కె.భవాని, పి.జాయ్ కుమారి, జి.మహాలక్ష్మి, జి.లోవకుమారి, జి.వరలక్ష్మి, కె.వీరమణి, యు.బాలజ్యోతి, వి.భారతి పాల్గొన్నారు. **పిఠాపురం** ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి సిడిపిఒ దుర్గాదేవికి వినతిపత్రం ఇచ్చారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మ, రమాప్రభ, తులసి, బి.కమలారాణి, హేమలత, విజయశాంతి, ప్రజావాణి, సత్యవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **పెద్దాపురంలో** ధర్నా నిర్వహించారు. పుప్పాల సావిత్రి, దాడి బేబీ మాట్లాడారు. శుభారత్నం, అన్నపూర్ణ, కుమారి, జ్యోతి, రత్నం, హసీనా, ప్రభావతి, ఉమా, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, డి.క్రాంతి కుమార్ పాల్గొన్నారు. **కోటనందూరులో** ధర్నా నిర్వహించారు. రమణమ్మ మేరీ సమాధానం, లవరత్నం, లీల, ఇంద్ర, పద్మ, సిఐటియు నాయకులు ఎస్‌కె.పద్మ, నక్కెళ్ల శ్రీను, బత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాకినాడలో వినతిపత్రం ఇస్తున్న బేబిరాణి

తాళ్లరేవులో..

పిఠాపురంలో..

కార్టూ'నిజం'

ఆయన నోట్లోంచి మాట రావడం లేదేంటీ.. అంటావా..? స్వాతంత్ర్య దినోత్సవానికీ... రిపబ్లిక్‌డేకీ తేడా అడిగార్లే...!!!

బిసిల అభ్యున్నతికి సిఎం జగన్ కృషి

ప్రజాశక్తి-సామర్లకోట

బిసిల అభ్యున్నతికి సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి చేస్తున్న కృషి వెలకట్టలేనిదని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. రెండోసారి రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన ఆవాల రాజేశ్వరి అభినందన సభలో బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బిసిలకు న్యాయం చేసేందుకు కషి చేసిన ఏకైక వ్యక్తి సిఎం జగన్మోహన్ రెడ్డి అన్నారు. చైర్‌పర్సన్ రాజేశ్వరికి మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కౌన్సిలర్లు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ గోకిన సుమిత్రాదేవి, కౌన్సిలర్లు సేపేని సురేష్, నేతల హరిబాబు, పాగా సురేష్ కుమార్, పిట్ట సత్యనారాయణ, గుబ్బల సత్యనారాయణ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు దులూరి సుబ్బారావు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న దొరబాబు

సూర్య సాహితి 'ఘన'తంత్రం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

74వ గణతంత్ర దినోత్సవాల నేపథ్యంలో పెదబ్రహ్మదేవంకు చెందిన కాకినాడ లిటిల్ బడ్స్ విద్యార్థిని తోటకూర సూర్య సాహితి ఎటు కూడినా 74 వచ్చే విధంగా గణిత చదరం రూపొందించి తన శుభాకాంక్షలు వినూత్నంగా తెల్పింది.

27	10	21	16
20	17	26	11
14	19	12	29
13	28	15	18

విద్యుత్ కాంతులతో కలెక్టరేట్

కలెక్టరేట్‌కు గణతంత్ర శోభ

ప్రజాశక్తి-కాకినాడ

75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కాకినాడ కలెక్టర్ కార్యాలయం విద్యుత్ దీపాల వెలుగులో దేదీప్యమానంగా వెలుగుతోంది. కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు కలెక్టర్ కార్యాలయం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే ప్రధాన ప్రవేశ మార్గం వద్ద ప్రత్యేకంగా భారీ జాతీయ పతాకం ఎగురవేసేందుకు స్తూపం ఏర్పాటు చేసి అందమైన లాన్ ఏర్పాటు చేశారు. గార్డెన్‌ను మువ్వన్నెల పతాకాన్ని గుర్తు తెచ్చేలా అలంకరించారు. గణతంత్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

కోరంగిలో 103 పక్షి జాతుల గుర్తింపు

ప్రజాశక్తి- తాళ్లరేవు

కోరంగి అభయారణ్యంలో ఇటీవల నిర్వహించిన సర్వేలో 103 పక్షి జాతులను గుర్తించినట్లు ఫారెస్ట్ రేంజర్ వరప్రసాద్ తెలిపారు. 2023 నీటి పక్షుల గణనలో భాగంగా కోరంగి బయోడైవర్సిటీ కేంద్రంలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సు అనంతరం ఈ పక్షుల గణన ప్రారంభించినట్లు తెలిపారు. 12 బృందాలుగా ఏర్పడి పక్షుల గణన చేశారన్నారు. ప్రతి బందంలో ఒక పక్షి పరిశోధకుడు, ఫోటోగ్రాఫర్, వాలంటీర్, విద్యార్థులు ఉన్నారన్నారు. హోప్ ఐలాండ్, కోరమండల్, ఏటిమొగ, కోరింక క్రీక్స్, గాడిమొగ, భైరవపాలెం, సాంక్రిమెంట్ ఐలాండ్‌లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పక్షుల గణన చేశారని తెలిపారు. బందాలు సేకరించిన సమాచారాన్ని బయాలజిస్ట్ డి. మహేష్ బాబు విశ్లేషించి సుమారు 39,816 పక్షులు ఉన్నట్టు తెలిపారు. వాటిలో 103 పక్షజాతులను ఇప్పటి వరకు గుర్తించినట్టు చెప్పారు. ఈ వివరాలన్నిటినీ నమోదు చేస్తున్నట్టు చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-గండేపల్లి

పి.నాయకంపల్లిలో సర్పంచ్ మల్లిరెడ్డి అన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ చంటిబాబు బుధవారం పాల్గొన్నారు. ఇంటింటికీ పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని, జగనన్న పాలన ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికే గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. జెడ్‌పి పాఠశాలలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చలగళ దొరబాబు, కందుల చిట్టిబాబు, అడబాల ఆంజనేయులు, నిమ్మలపూడి శ్రీహరి, ముత్యాల రవి, ఉండవల్లి జమీ, దమ్ము అప్పారావు, ప్రసాద్, మల్లిరెడ్డి పాపారావు పాల్గొన్నారు.

మెటీరియల్ అందజేస్తున్న శ్రీనివాస్

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి-కోటనందూరు

కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడంలో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంపిపి ఎల్.శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఉపాధ్యాయులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించి 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ ఉల్లూరు శ్రీను, ఎంపిటిసి సభ్యులు రెడ్డి స్వామి నాయుడు, ఎంఇఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫాస్ట్ ఫుడ్ సెంటర్ దగ్ధం

ప్రజాశక్తి-కరప

వేళంగిలోని పాన్ షాప్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ బుధవారం అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధం అయ్యాయి. సిరిపురం వెళ్లే సెంటర్ వద్ద గ్రామానికి చెందిన గుత్తుల శ్రీరాములు కిళ్లీ కొట్టు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం వంటలు చేస్తుండగా అకస్మాత్తుగా స్టవ్ నుంచి మంటలు చెలరేగి షాప్ అంతా వ్యాపించాయి. దీంతో రెండు షాపులు అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు పక్క షాపులకు వ్యాపించకుండా స్థానికులు వచ్చి అదుపు చేశారు.

తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బాబి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ధూళిపూడి వెంకటరమణ (బాబీ) నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన టిడిపి ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దాట్ల సుబ్బరాజు, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు, జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, జాతీయ కార్యదర్శి నారా లోకేష్ బాబీ కృతజ్ఞతలు తెలిపారు.

వర్మి కంపోస్టు తయారీపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఎస్‌డబ్ల్యుపిసి సంపద తయారీ కేంద్రాల్లో వర్మి కంపోస్టు తయారీ పెంపుపై గ్రామ కార్యదర్శులు దృష్టిపెట్టాలని ఎంపిడిఒ డి.శ్రీలలిత ఆదేశించారు. బుధవారం హుస్సేన్‌పురం, జి.మేడపాడు, పెద్దబ్రహ్మదేవం గ్రామాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌డబ్ల్యుపిసి షెడ్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి హిమమహేశ్వరి, పిబిదేవం సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, గ్రామ కార్యదర్శులు పివిఎస్ రామనాధం, టి.సీతారామప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ నూకరాజు మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం అంకయ్య పేటకు చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్, వైసిపి నాయకులు తూతిక నూకరాజు(69) బుధవారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో ఉన్నారు. గుండెపోటుతో ఆసుపత్రికి చేర్చగా చికిత్స పొందుతూ మరణించారు. 2005 నుండి 2010 వరకు ఆయన మున్సిపల్ కౌన్సిలర్‌గా పని చేశారు. వైసిపి పట్టణ ఉపాధ్యక్షులుగా పని చేశారు. ఆయన మృతికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, తోట సుబ్బారావు నాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ బొద్దు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు సంతాపం తెలిపారు.

యూనిఫామ్ లేకుంటే చర్యలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

గ్రామ సచివాలయాల సిబ్బంది, ఉద్యోగులు నిర్దేశించిన యూనిఫారాలు ధరించకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ శ్రీలలిత హెచ్చరించారు. బుధవారం మండలంలోని జి.మేడపాడు-1, పిబిదేవం-1 సచివాలయాలను ఎంపిడిఒ తనిఖీలు చేపట్టారు. కొంత మంది సిబ్బంది సివిల్ డ్రెస్‌లో హాజరుకావడం గుర్తించి మందలించారు. హాజరు నమోదు తప్పనిసరిగా చెయ్యాలని, ఆఫీసు నుండి పనిపై వెళ్ళినపుడు మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

రోడ్డు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

ఆర్ అండ్ బి రహదారికి మోక్షం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఆరు నెలలుగా తాళ్ళరేవు ప్రధాన రహదారిపై ఉన్న గుంతల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు మోక్షం కలిగింది. ఆర్ అండ్ బి రహదారికి మరమ్మతు చేపట్టింది. మెయిన్ రోడ్డుకు సంబంధించి చెరువుగట్టు సెంటర్, దేవీ మహల్ సెంటర్, గుడ్డువాని తూము పరిసర ప్రాంతాల్లో ప్రధాన గుంతలను తారు రోడ్డు వేసి పూడ్చారు. ఆర్ అండ్ బి శాఖ అత్యవసర మరమ్మతుల నిధులు రూ.12 లక్షలతో చిన్న గుంతలను సైతం పూడ్చనున్నట్లు ఎఇ ఇవి.ప్రసన్న తెలిపారు.

అభ్యర్థుల పత్రాలు తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఆదిత్యలో జెఇఇ మెయిన్స్ పరీక్షలు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జెఇఇ మెయిన్స్ పరీక్షలు రెండో రోజు నిర్వహించారు. ఈ పరీక్షలకు ప్రిసీడింగ్ ఆఫీసర్‌గా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర ఎం.శ్రీనివాస్ రెడ్డి, టెస్ట్ సెంటర్ అడ్మిన్‌గా ప్రొఫెసర్ ఎం.రాజబాబు వ్యవహరించారు. ఈ రోజు పరీక్షకు ఉదయం 113 మంది హాజరవ్వాల్సి ఉండగా 112 మంది హాజరయ్యారు. సాయంత్రం 110 మందికి గాను 109 మంది హాజరు కాగా ఒకరు హాజరు కాలేదని సెంటర్ అడ్మిన్ రాజబాబు తెలిపారు.

గణతంత్ర వేడుకలకు కైట్ విద్యార్థులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఢిల్లీలో నేడు జరగనున్న గణతంత్ర వేడుకల రిపబ్లిక్ డే పెరేడ్‌కు కైట్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు విద్యాసంస్థల చైర్మన్ పోతుల వెంకట విశ్వం తెలిపారు. గతేడాది వరకు కైట్ కళాశాలల నుంచి ఏడుగురు విద్యార్థులు ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో పాల్గొనగా ఈ ఏడాది బిటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి కె.వెంకటేశ్వరరావు రాష్ట్రపతి పెరేడ్‌లో పాల్గొనడమే కాక రాష్ట్రపతి డిన్నర్‌కు ఎంపికైనట్టు తెలిపారు.

రైతులు సస్యరక్షణ చేపట్టాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

జిల్లాలో ప్రస్తుత దాళ్వా వరిలో కాండం తొలుచు పురుగు ఉధతి ఎక్కువగా ఉన్నట్టు గమనించామని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. బుధవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల బృందం ఎడిఎ రమేష్, వ్యవసాయాధికారి విశ్వాస రావు, ఎఇఒ గణేష్, విఎఎలు గంగాధర్, గీతామణి, రాము జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి పొలాల్లో కాండం తొలుచు పురుగును గుర్తించారన్నారు. దీనిపై రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టారు.

పోలవరానికి నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

పోలవరం ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్లు కేటాయించాలని, పక్క రాష్ట్రాల సమస్యలను పరిష్కరించి చట్ట ప్రకారం ఆర్ అండ్ ఆర్ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఫార్వార్డ్ బ్లాక్ రాష్ట్ర సమితి తీర్మానించింది. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 1939లో స్థాపించిన అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ 2వ రాష్ట్ర మహాసభల సందర్భంగా బుధవారం స్థానిక పిఆర్.ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలోని మద్దూరి అన్నపూర్ణయ్య విగ్రహానికి మాజీ ఎంపీ, ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ ప్రధాన కార్యదర్శి దేవబ్రత బిస్వాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిబియం కళాశాల ఆవరణలో జరిగిన సభలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా బి.సుభాష్ చంద్రారెడ్డి, ఉపాధ్యక్షునిగా లంక కష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా పివి సుందర రామరాజు, కార్యదర్శిగా అయినాపురపు సూర్యనారాయణ, పి.రఘువంశ ప్రతాప్, ఆర్.రాజునాయుడు, జయవర్ధన్, టి.రామచంద్ర, టి.రవీంద్ర ఎన్నికయ్యారు.

రోడ్డు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కరప

అరట్లకట్టలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న షేక్ వీరబాబు కుటుంబానికి విశ్రాంత కార్మిక శాఖాధికారి వంకాయల శ్రీనివాసరావు రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, పాల్గొన్నారు.

ఎపి ఆర్‌సెట్ అభ్యర్థులకు అడ్మిషన్లు

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌యుకె ప్రాంగణంలో ఎపి రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ -2022 (ఎపి ఆర్‌సెట్)లో అర్హత సాధించిన అభ్యర్థులకు మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ విభాగం ఆధ్వర్యంలో జెఎన్‌టియుకె సెనేట్ హాల్లో నిర్వహిస్తున్న అడ్మిషన్ల ప్రక్రియ బుధవారం కొనసాగింది. ఈ నేపథ్యంలో బుధవారం నిర్వహించిన అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా 60 మందికి ప్రవేశాలు కల్పించినట్లు డైరెక్టర్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ కె.పద్మరాజు తెలిపారు. వివిధ కారణాల రీత్యా హాజరుకాలేకపోయిన అభ్యర్థులకు ఈ నెల 27, 28 తేదీల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విసి ప్రొఫెసర్ జివిఆర్. ప్రసాదరాజు, రెక్టార్ ప్రొఫెసర్ కె.వి.రమణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎల్.సుమలత, వి.రవీంద్ర, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ కె.పద్మరాజు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

తిరుపతి ఆలయానికి రూ.21.70 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శ్రీ శంగార వల్లభ స్వామి ఆలయ హుండీలను బుధవారం లెక్కించగా రూ.21,70,666 ఆదాయం సమకూరిందని ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. ఎంఎస్ఎన్ చార్టీస్ ఎసి పి.బాబూరావు సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించారన్నారు. 75 రోజులకు సంబంధించి స్వామివారి హుండీల ద్వారా రూ.18,49,510, అన్నదానం హుండీల ద్వారా రూ.3,21,156 ఆదాయం సమకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.వీరభద్ర రావు, స్వచ్ఛంద సేవకులు,సిబ్బంది పాల్గొన్నారన్నారు.

పలు కుటుంబాలకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి-కరప

మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ కురసాల కననబాబు బుధవారం పరామర్శించారు. నడకుదురులో పిల్లి లక్ష్మణ్, పైల పెద్ద గోవిందు, చీపురుపల్లి అప్పారావు, పెనుగుదురులో పోతుల రంగారావు, పెద్దాపురపాడు-సావరంలో శనివారపు కామేశ్వరరావు, వాసిరెడ్డి సూర్యభాస్కరరావు, కోరం పెద్ద సూర్యారావు, వాసిరెడ్డి సూర్యభాస్కరరావు, కాలకురచ సావిత్రమ్మ, గుబ్బల సూర్యనారాయణ, సాంబత్తుల రాజారావు, చక్కపల్లి సూర్యకాంతం, వేళంగిలో చంద్రు తారకం, షేక్ జుబేగం, తుమ్మల మున్ని కుటుంబాలను ఆయన పరారర్శించారు. ఆయన వెంట జెడ్‌పిటిసి యాళ్ల సుబ్బారావు, పెంకే శ్రీలక్ష్మీ సత్తిబాబు, చింతా ఈశ్వరరావు, నక్కా సత్తిబాబు, సాదే ఆశాజ్యోతి ఉన్నారు.

ఆలయాలను దర్శించుకున్న సినీ దర్శకులు

ప్రజాశక్తి-పిఠాపురం

ప్రముఖ పుణ్యక్షేత్రాలైన పాదగయ క్షేత్రాన్ని, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానాన్ని సినీ దర్శకులు కొరటాల శివ దంపతులు, హరీష్ శంకర్, సానా బుచ్చిబాబు దంపతులు బుధవారం దర్శించుకున్నారు. తొలుత మహాసంస్థానంలో దత్తాత్రేయుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం దత్తాత్రేయుడి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దత్త ప్రచారకులు నారాయణ దత్త ఆధ్వర్యంలో పాదగయ క్షేత్రంలో దర్శకులు ప్రత్యేక హోమం నిర్వహించారు. అనంతరం కుక్కుటేశ్వర స్వామిని, పదో శక్తిపీఠం పురూహుతికా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పాదగయ దేవస్థానం చైర్మన్ ఆగంటి ప్రభాకర్, శ్రీపాద శ్రీ వల్లభ మహాసంస్థానం చైర్మన్ ఆర్ జనార్ధన్‌రావు, ఇఒ సౌజన్య దర్శకులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జాతీయ రహదారిపై గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి-గండేపల్లి

వీధిలైట్లు వెలగ పోవడంతో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని బుధవారం జెడ్.రాగంపేట జంక్షన్ వద్ద గ్రామస్తులు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఒక మోటార్ సైక్లిస్టుకు ప్రమాదం జరగడంతో వారికి గాయాలయ్యాయి. రోడ్డు జంక్షన్ వద్ద రోడ్డు దాటే సమయంలో వీధిలైట్లు సక్రమంగా వెళ్ళకపోవడం వల్ల వాహనాలు కనిపించడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేరాలు ఘోరాలు

గంజాయి కేసులో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - ధవళేశ్వరం

గంజాయిని తరలిస్తున్న నలుగరు యువకులను ధవళేశ్వరం పోలీసులు అరెస్టు చేశారు. సిఐ మంగాదేవి తెలిపిన వివరాల మేరకు...పోలీసులకు అందిన సమాచారంతో గ్రామంలో మంతిన సత్యనారాయణరాజు ఆశ్రమం సమీపంలో గంజాయితో ఉన్న నలుగురు యువకులను ఎస్ఐ క్రాంతికుమార్ సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. పేరాబత్తుల సునీల్‌కుమార్, బహుదూర్ రామ్, కొయ్యి దుర్గ, సాంబత్తుల మణితేజలను అరెస్టు చేశారు. వారి నుంచి 21.765 కేజీల గంజాయిని, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి-కొత్తపేట

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైనట్లు కొత్తపేట అదనపు ఎస్ఐ డి.శశాంక తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. పార్వతీ పురం జిల్లా మక్కువ మండలం పెద్దవలస గ్రామానికి చెందిన రాయపల్లి గోపాలం అతని కుటుంబంతో కొత్తపేట శివారు కైలాస భూమి వద్ద ఉన్న బైరి శెట్టి వీర వెంకట సత్యనారాయణ కు చెందిన ఇటుక బట్టి నందు పని చేస్తూ జీవనోపాధి సాగిస్తున్నారు. ఇది ఇలా ఉండగా ఆదివారం అర్ధరాత్రి నుంచి మతి స్థిమితం లేని తన కుమారుడు రాయపల్లి ప్రసాద్ కనిపించడం లేదంటూ తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్ఐ తెలిపారు. నీలం రంగు టీషర్ట్, నలుపు రంగు ఫాంటు, కుడి చేతిపై నాగసర్పం పచ్చబొట్టు ఉంటుందని, వివరాలు తెలిసిన వారు కొత్తపేట ఎస్ఐ సెల్ నెం.94409 04842 కు సమాచారం ఇవ్వాలని ఆమె తెలిపారు.

సారా బట్టీలపై దాడి

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి మండలం ఎర్రంపాలెం గ్రామ శివారులో సారా తయారు చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న జగ్గంపేట సిఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ గణేష్ కుమార్ బట్టీలపై దాడి నిర్వహించారు. సుమారు 1200 లీటర్ల సారా తయారు చేయడానికి ఉపయోగించే పరికరాలను ధ్వంసం చేశారు అనంతరం వారు మాట్లాడుతూ సారా తయారు చేసిన సారా విక్రయాలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు ఇటువంటి పరిస్థితులు నెలకొన్నప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. వీరి వెంట పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు

బంగారు, వెండి నగలు చోరీ

ప్రజాశక్తి-కరప

కరప మండలం వాకాడ గ్రామంలో ఒక ఇంట్లో దొంగలు పడి బంగారం వెండి చోరీకి గురయ్యాయి. కరప పోలీసులు తెలిపిన వివరాలు.. మేరకు సంక్రాంతి పండుగనే అత్తవారింటికి వెళ్లగా తిరిగి వచ్చి చూసేసరికి ఇంట్లో ఉన్న వెండి బంగారం నగలు సుమారు రూ.3 లక్షలు విలువచేసే వస్తువులు దొంగతనానికి గురైనట్లు పోలీసులకు అడబాల సత్తిబాబు ఫిర్యాదు చేశారు. ఈనెల 13న అడబాల సత్తిబాబు కుటుంబ సభ్యులతో సామర్లకోట అత్తవారింటికి వెళ్లినారు. ఈ నెల 24న తిరిగి గ్రామాన్ని చేరుకుని బీరువా లో ఉన్న బంగారు, వెండి వస్తువులు లేకపోవడం తో వేసిన తాళాలు వేసినట్లుండగా ఇంట్లో బంగారం, వెండినగలు దొంగిలించినట్లు గుర్తించారు.

ఈ విషయంపై బుధవారం కరప ఎస్ఐ నౌడు రామకృష్ణ కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించి కాకినాడ నుంచి క్లూస్ టీమ్ ను రప్పించి చుట్టుపక్కల వ్యక్తులను విచారిస్తున్నారు. వేలు ముద్ర లు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఎల్ఎ సతీష్‌ను ప్రశ్నిస్తున్న ప్రజలు

ఎంఎల్ఎ పొన్నాడకు నిరసనల సెగ

ప్రజాశక్తి-ఐ.పోలవరం

ఒకే కుటుంబంలో నాలుగు, ఐదు ఇంటి స్థలాలు ఇచ్చారని అర్హులకు ఇవ్వలేదని పలువురు ఎమ్ఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను పాత ఇంజరం గ్రామ పంచాయతీ ఫిషర్ కాలనీలో బుధవారం జరిగిన గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో నిలదీశారు. వై సి పి మండల అధ్యక్షులు పిన్నమరాజు వెంకటపతిరాజు ఆధ్వర్యంలో ఎంపిపి మోర్త రాణి మిరియం జ్యోతి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్ఎల్ఎ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. గ్రామంలో అనేక మంది మహిళలు తమకు ఇళ్ల స్థలాలు విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందని వాపోయారు. ఒకే కుటుంబంలో నాలుగు, ఐదు ఇంటి స్థలాలు ఇచ్చారన్నారని, అర్హులైనవారికి ఇవ్వలేదని మల్లాడి అంజి బాబు, రవి, చింతా నాగూరు, అంగాడి సత్యనారాయణ అన్నారు. ఇంటి స్థలం ఇచ్చిన వెంటనే ఇల్లు నిర్మాణం చేసి ఇస్తామని చెప్పారని ఇప్పటి వరకు స్థలం చూపించ లేదన్నారు. ఇంటికి సంబందించిన రిజస్టేషన్ పత్రాలు కొరకు రూ 10వేలు కట్టించు కొని ఇప్పటి వరకు రిజస్టేషన్ పత్రాలు ఇవ్వలేదని ఎమ్ఎల్ఎను ప్రశ్నించారు. కార్యక్రమంలో జెడ్ పి టి సి సభ్యులు ముదునూరి సతీష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కొత్తపేట రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్ఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట-5 గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరించారు. పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపి నాయకునికి పరామర్శ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

కామనగురువు గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు రాజులపూడి ఆనంద్ ను బుధవారం రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ పరామర్శించారు. ఇటీవల ఆనంద్ తల్లి మరణించింది. ఆమె మృతికి మంత్రి, నాయకులు సంతాపం తెలియజేసి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మృతురాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి వెంట ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, నాయకులు ఉన్నారు. **ఉప్పలగుప్తం** మాతృవియోగంతో బాధపడుతున్న వానపల్లిపాలెంకు చెందిన వైసిపి నాయకుడు నల్లా నాయుడు, కుటుంబ సభ్యులను మంత్రి పినిపే విశ్వరూప్ బుధవారం పరామర్శించారు. నాయుడు తల్లి మాణిక్యం ఇటీవల మృతి చెందారు. మాణిక్యం చిత్రపటానికి మంత్రి విశ్వరూప్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపిపి సాదే శ్రీనివాసరావు, వైసిపి నాయకులు చెల్లుబోయిన శ్రీను, నల్లా సూర్యప్రకాష్, వెంకటనారాయణ, ఆదినారాయణ, భైరవస్వామి, వీరభద్రం, బొంతు సత్యనారాయణ, వీర రాఘవులు, పెయ్యల రమణ తదితరులు ఉన్నారు.

'వూటుకూరి'కి సతీ వియోగం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

రాష్ట్ర దేవాంగ సంఘ గౌరవ సలహాదారుడు, కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు, అమలాపురం మండల మాజీ అధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్యస్వామి సతీమణి వూటుకూరు ధనలక్ష్మి బుధవారం మరణించారు. ఆమె ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ మృతి చెందారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. ధనలక్ష్మి మరణంపై రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు డికె.నాగరాజు తదితరులు సంతాపం తెలిపారు.

వాడ్రేవు వంశీయులను సన్మానిస్తున్న దృశ్యం

పాఠశాల స్థలదాతకు ఘన సన్మానం

ప్రజాశక్తి-రామచంద్రపురం

వేగాయమ్మపేటలో గల మహాలక్ష్మమ్మ ప్రభుత్వ పాఠశాలకు రూ.కోట్ల విలువైన భూములు దానం చేసిన వాడ్రేవు వంశీయులను ద్రాక్షారామ పివిఆర్ హైస్కూల్ సాధన సమితి బుధవారం సన్మానించింది. వక్తలు మాట్లాడుతూ విద్యార్థుల కోసం రూ.కోట్లు విలువైన సొంత భూములను వాడ్రేవు వంశీయులు దానం చేసి చిరస్థాయిగా కీర్తి గడించారు అన్నారు. ద్రాక్షారామ లో దాతలు ఇచ్చిన 4 ఎకారాలతో నిర్మించిన పివిఆర్ హైస్కూల్, ఏర్పాటుచేసిన క్రీడాప్రాగణం తాళాలు వేసి పై డా జమీందారులు పెత్తనం చెలాయించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ మాదిరిగా ద్రాక్షా రామ హైస్కూల్ ను ప్రభుత్వానికి అప్పగించి విద్యార్థులకు విద్య అందించాలని కోరారు. కార్య క్రమం లో వేగాయమ్మ పెట సర్పంచ్ అంబటి తుకారాం, వైసిపి నాయకులు మగాపు అమ్మిరాజు, ఆళ్ల బుజ్జి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ వేగుళ్ల కోలుకోవాలని ప్రార్థనలు

ప్రజాశక్తి-మండపేట

ఇటీవల ప్రమాదానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్ఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావును ఆయన నివాసంలో ముస్లిం ప్రముఖులు, సోదరులు పరామర్శించి గాంధీనగర్ మసీదు ఇమామ్ మహమ్మద్ ఖాసిమ్ అన్సారీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఆయన త్వరగా కోలుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు సల్మాన్, షేక్ ఇబ్రాహీం, జమాతె ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రిజ్వాన్, అల్ అమీన్ మసీదు ప్రెసిడెంట్ జైనులాబిదీన్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

కొత్తపేటలోసత్యసాగర్‌కు రూ.50 వేలు అందిస్తున్న జనసేన సేవాదళ్

ప్రజాశక్తి-కొత్తపేట

ఇటీవల సంక్రాంతి ఉత్సవాల్లో ప్రమాదవశాత్తు గాయపడ్డ కొత్తపేట సంతోష్ నగర్ కు చెందిన సత్యసాగర్ కు కపిలేశ్వరం మండలం కోరుమిల్లి గ్రామం జనసేన సేవాదళ్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రూ. 50వేల ఆర్థిక సాయం బుధవారం అందజేశారు. అమలాపురం సాయి సంజీవిని ఆస్పత్రిలో చికిత్స పొందిన సత్యసాగర్ ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యి కొత్తపేట సంతోష్ నగర్ లో అతని స్వగహానికి చేరుకున్నాడు. కొద్ది రోజుల విశ్రాంతి అనంతరం మరొక ఆపరేషన్ చేయాలని డాక్టర్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన సేవాదళ్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సంతోష్ నగర్ లోని సత్యసాగర్ ఇంటికి వెళ్లి అతడిని పరామర్శించారు.

కాట్రేనికోన ఫ్రెండ్స్ ఫరెవర్ హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజషన్ ఆధ్వర్యంలో ప్రమాదంలో గాయపడిన బాధితునికి బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. కాట్రేనికోన పంచాయతీ ఒకటవ వార్డ్ సంత మార్కెట్ ప్రాంతానికి చెందిన పుట్టే వెంకన్న ఇటీవల మోటర్ సైకిల్ మీద నుంచి ప్రమాదవశాత్తు కింద పడి గాయపడ్డాడు. ఇప్పటికే రెండు ఆపరేషన్లు చేసినప్పటికీ పూర్తిగా కోలుకోకపోవడంతో మరొక ఆపరేషన్ చేయాలని డాక్టర్లు తెలపడంతో బాధితుడు దాతలు సహాయం కొరకు ఎదురు చూస్తున్నాడు.వెంకన్న కు ఇద్దరు ఆడపిల్లలు. బాధితుని పరిస్థితిని ఫ్రెండ్స్ ఫరెవర్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ తెలుసుకొని పుట్టే వెంకన్న కు చికిత్స నిమిత్తం రూ.15 వేల సాయం స్థానిక సర్పంచ్ గంటి సుధాకర్ చేతుల మీదగా బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజెషన్ సభ్యులు నాగబత్తల జాను, బూసి రాంబాబు, ముడిదుడ్డి రాము, ప్రసాద్, రాజేష్, వరప్రసాద్, సిద్ధు, అప్పారావు, నారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోనలో బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న దృశ్యం

ప్రత్యామ్నాయం చూపకుండా ఫ్లెక్సీల నిషేధం దారుణం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎలాంటి ప్రత్యామ్నాయం మార్గాలు చూపకుండా ఫ్లెక్సీల నిషేధం అమలు చేయడం దారుణమని రాజమహేంద్రవరం ఫ్లెక్స్ ప్రింటింగ్ ఓనర్స్ అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణారావు, గౌరవాధ్యక్షులు వీరభద్రరావు బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం చెప్పినట్టు క్లాత్ వాడాలంటే ఇప్పుడున్న యంత్రాలను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఇందుకు అవసరమైన రుణాలు మంజూరు చేసి, అప్ గ్రేడ్ అయ్యేవరకూ గడువు ఇవ్వాలని వారు డిమాండ్ చేసారు. రుణాలు ఇప్పిస్తామని చెప్పినప్పటికీ ఎక్కడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. కరోనా కాలంలో నష్టాలను చవిచూశామన్నారు. ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న సమయంలో నిషేదం అమలు చేస్తూ పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోతామనానరు. ప్లాస్టిక్ బ్యాగ్‌లు, గ్లాసులతో పోలిస్తే ఫ్లెక్స్‌ల వలన పర్యావరణానికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. ప్రభుత్వం తమ పట్ల దయదలచి, సానుకూల దక్పథంతో వ్యవహరించాలని కోరారు. ఈ సమవేశంలో నాగేశ్వరరావు, రాజా, మహేష్, రాజారమేష్, మాణిక్యం, మణికంఠ, రాజశేఖర్, రాము, ప్రశాంత్, అంజనీ, పలువురు ఫెక్సీ సెంటర్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కోసం రైతుల ఎదురుచూపు

ప్రజాశక్తి-రామచంద్రపురం

తొలకరిలో పండించిన వరి ధాన్యాన్ని డిసెంబర్‌లో ట్రాక్ చేసినా ఇప్పటివరకు కొనుగోలు చేయలేదని కె.గంగవరం మండలంలోని యండ గండి గ్రామానికి చెందిన కౌలు రైతు అధికారులకు ఫిర్యాదు చేశారు. తాము పండించిన ఐదు ఎకరాల్లో పంట స్థానిక విఎఎ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ మీరు ఏం చేసుకుంటారు చేసుకోండని చెప్పడంతో జిల్లా అధికారులకు ఆర్‌డిఒకు, ఎఒకు తెలియజేసినట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలో మరో 27 మంది రైతులు తమ వద్ద నిలువ ఉన్న సుమారు 33000 బస్తాలు ఇంకా కొనుగోలు చేయలేదని ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోలు ఆలస్యం కావడంతో ధాన్యం పాడైపోతుంది అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు వద్ద నున్న ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

దీనిపై కె.గంగవరం మండలం వ్యవసాయ అధికారి బలుసు రవి ని వివరణ కోరగా విషయాన్ని సివిల్ సప్లై అధికారుల దష్టికి తీసుకు వెళ్ళామని20 రోజులుగా దీనిపై అనుమతుల కోసం మాట్లాడుతున్నామని అనుమతులు వచ్చిన వెంటనే కొనుగోలు చేస్తామని ఇక్కడ ధాన్యం నిల్వ ఉన్నట్లు యాప్ లో నమోదు చేశామన్నారు.

ఎంఎల్ఎ బాలరాజుకు జక్కంపూడి పరామర్శ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గుండె పోటుతో రాజమహేంద్రవరంలోని సాయి ఆసుప్రతిలో చికిత్స పొందుతున్న పోల వరం ఎంఎల్ఎ తెల్లం బాల రాజును వైసిపి జిల్లా అధ్యక్షులు, రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా బుధ వారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. బాలరాజు కోలు కుంటు న్నారని వైద్యులు ఆయనకు తెలిపారు.

పేరు మార్పు

అమలాపురం పట్టణానికి చెందిన **మొహమద్ ఖాజా,** S/o. మొల్లాలాల్ తెలియజేయునది ఏమనగా, ఇంతవరకు నేను **మొహమద్ ఖాజా మొహిద్దిన్ చిస్టి రహ్మతుల్లా,** S/o. మొల్లాలాల్ గా పిలవబడగా ఇకపై నా పేరును **మొహమద్ ఖాజా** గా పేరును మార్పు చేయడమైనది. కావున యావన్మంది ఈ మార్పును గమనించవలసిందిగా కోరుచున్నాను.

మొహమద్ ఖాజా
S/o. మొల్లాలాల్, డో.నెం. 5-2-87,
ముజఫర్ సందు,
ముస్లిం వీధి, అమలాపురం
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్: 8978138477

In the Court of the Vth Additional Junior Civil Judge, Kakinada
O.S. No. 308/2020

Between:
Komallapalli Subhadrabhanu ...*Plaintiff*
AND
Somaripeta Janakamma and Others ...*Defendants*

To:
D-2: Juttuka Polamma, W/o. Juttuka Saikumar, aged 52 years, R/o. Dubai.
D-3: Juttuka Saikumar, S/o. Dhanaraju, aged 52 years, D.No. 3-1-52/27/2FS-1, Perrajupeta, Kakinada.
D-6: Somaripeta Satish, S/o. (late) Srinivas, aged 19 years, D.No. CF6, Rajiv Gruhakalpa, Peeraju peta, Near RTC Complex, Kakinada.
D-7: Somaripeta Bhaskar Kumar, S/o. (late) Srinivas, D.No. CF6, Rajiv Gruhakalpa, Peeraju peta, Near RTC Complex, Kakinada.

పై నెంబరు దావాలో D2, D3 మరియు D6, D7 ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనకుండగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 30-1-2023వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)

K.LAKSHMI NAIDU, Advocate
Kakinada, Cell: 9491424898